ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ : 28.11.2025 సమయం : 1810 గంటలు

ముఖ్యాంశాలు

1. సమాజాన్ని మరింత సమ్మిళితంగా, శాంతియుతంగా మార్చడానికి భారత ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు.
2. జాతీయ లక్ష్యానికి అంకితమైన తొమ్మిది తీర్మానాల అమలుకు పౌరుల నిబద్ధత అవసరమని, దేశ ప్రాచీన జ్ఞానాన్ని తదుపరి తరానికి అందించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు పిలుపునిచ్చారు.
3. ఎన్డీఏ హయాంలో రైల్వేల అభివృద్ధి వేగవంతమైందని, తెలంగాణలోనే ఏకకాలంలో 40 రైల్వే స్టేషన్ల పునరుద్ధరణ జరుగుతోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు.
4. బీసీల సర్వతోముఖాభివృద్ధి ప్రస్ఫుటించేలా తెలంగాణ దార్శనిక పత్రంలో బీసీ సంక్షేమ శాఖ పలు కీలక అంశాలు ప్రతిపాదించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు.

-------------------------

**ముర్ము**

సమాజాన్ని మరింత సమ్మిళితంగా, శాంతియుతంగా, ఆరోగ్యంగా, విలువ ఆధారితంగా మార్చడానికి భారత ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ప్రపంచవ్యాప్తంగా యోగా, ధ్యానాన్ని ప్రోత్సహించడం, అంతర్జాతీయ యోగా దినోత్సవ ప్రచారానికి నాయకత్వం వహించడం అలాంటి చొరవలే అని చెప్పారు. 2025-26 సంవత్సరానికి బ్రహ్మ కుమారీల వార్షిక ఇతివృత్తమైన 'ప్రపంచ ఐక్యత, విశ్వాసం కోసం ధ్యానం' కార్యక్రమం ప్రారంభోత్సవం లక్నోలో జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి పాల్గొని

ప్రసంగించారు. భారతదేశ ప్రాచీన నాగరికత ఎల్లప్పుడూ ప్రపంచానికి వసుధైవ కుటుంబం అనే సందేశాన్ని అందిస్తుందని ఆమె అన్నారు. నేడు, ప్రపంచం అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నప్పుడు, ఈ ఆలోచనలు మరింత సందర్భోచితంగా మారుతున్నాయన్నారు. బ్రహ్మ కుమారీల ప్రచారం ఇందులో ప్రభావవంతమైన పాత్ర పోషిస్తుందని అన్నారు.

**ఎస్ఎస్డీ**

------------------------

**ప్రధానమంత్రి**

జాతీయ లక్ష్యానికి అంకితమైన తొమ్మిది తీర్మానాలకు పౌరుల నిబద్ధత అవసరమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఈరోజు కర్నాటక పర్యటనలో ఉడిపిలోని శ్రీ కృష్ణ మఠం భక్తులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, నీటిని, నదులను సంరక్షించడానికి, ఏక్ పేడ్ మా కే నామ్‌లో భాగం కావడానికి, పేదరికం నుండి కనీసం ఒక వ్యక్తిని ఉద్ధరించడానికి, మన ఆర్థిక వ్యవస్థను కాపాడుకోవడానికి స్వదేశీ ఉద్యమాన్ని ప్రోత్సహించడానికి.. సాధువులు, భక్తులు, పౌరుల మద్దతును ఆయన కోరారు. సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, చిరుధాన్యాలను ఉపయోగించి ఆరోగ్యకరమైన జీవనశైలిని కొనసాగించాలని, చమురు వాడకాన్ని తగ్గించాలని, యోగాను మన దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈరోజు ప్రధానమంత్రి ప్రస్తావించిన తొమ్మిది తీర్మానాలలో, మన పురాతన లిఖిత ప్రతుల పరిరక్షణ కూడా ఉంది. మన ప్రాచీన జ్ఞానాన్ని తదుపరి తరానికి అందించాలని ఆయన అన్నారు. వారసత్వం, సంప్రదాయాలకు ప్రసిద్ధి చెందిన 25 ప్రదేశాలను సందర్శించాలని కూడా ఆయన భారతీయులకు పిలుపునిచ్చారు. శ్రీకృష్ణుని బోధనలైన భగవద్గీత కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రేరణనిస్తుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

**బైట్ - ప్రధానమంత్రి**

బంగారు పూతతో కూడిన తీర్థ మంటపాన్ని ఈసందర్భంగా ప్రధానమంత్రి ప్రారంభించారు.

**ఎస్ఎస్డీ**

----------------------------

**కిషన్ రెడ్డి**

ఎన్డీఏ హయాంలో రైల్వేల అభివృద్ధి వేగవంతమైందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. రైల్వే లైన్ల నిర్మాణం, స్టేషన్ల ఆధునీకరణ సహా తెలంగాణలోనే ఏకకాలంలో 40 రైల్వే స్టేషన్ల పునరుద్ధరణ జరుగుతోందని చెప్పారు. హైదరాబాద్ లోని హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలించిన అనంతరం కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. 720 కోట్ల రూపాయలతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, 424 కోట్ల రూపాయలతో కాచిగూడ రైల్వేస్టేషన్ ఆధునీకరణ జరుగుతోందని అన్నారు. హైదరాబాద్ లో ఇప్పటికే ఉన్న సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి టర్మినల్స్ కు తోడు.. ఇటీవలే చర్లపల్లిలో మరో టెర్మినల్ ను ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రారంభించారని గుర్తు చేశారు. హైటెక్ సిటీ రైల్వేస్టేషన్ లో 4 లిఫ్టులు, 2 ఎస్కలేటర్లు, ఆధునిక వెయిటింగ్ రూమ్స్, దివ్యాంగులకు అనుకూలమైన నిర్మాణాలు జరుగుతున్నాయని కిషన్ రెడ్డి తెలిపారు.

**బైట్ - కిషన్ రెడ్డి**

ఎంఎంటీఎస్ సెకండ్ ఫేజ్‌ను యాదాద్రి వరకు పొడిగించేలా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని మంత్రి చెప్పారు.

**జీఎస్**

--------------------------

**పొన్నం**

బీసీల సర్వతోముఖాభివృద్ధిని ప్రస్ఫుటించేలా తెలంగాణ దార్శనిక పత్రంలో బీసీ సంక్షేమ శాఖ పలు కీలక అంశాలు చేర్చాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. తెలంగాణ రైజింగ్ -2047 పాలసీ కోసం బీసీ సంక్షేమ శాఖ లో తీసుకోవాల్సిన అంశాలపై ఈరోజు నిర్వహించిన సమీక్షలో పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో వెనుకబడిన తరగతులకు చెందిన వాళ్లు.. వ్యవసాయం, చేతివృత్తులు, నైపుణ్యాలు, సాంప్రదాయ

వృత్తులకు వెన్నెముకగా నిలుస్తున్నారని అన్నారు. వారి సామాజిక, ఆర్థిక పురోగతి.. రాష్ట్ర వృద్ధికి కీలకమైందన్నారు.

**జీఎస్**

---------------------------

**ఇరుముడి**

శబరిమల పవిత్ర యాత్రకు వెళ్లే అయ్యప్ప భక్తులు విమాన ప్రయాణంలో ఇరుముడిని తమతో తీసుకెళ్లేందుకు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ అనుమతి ఇచ్చిందని ఆ శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. అవసరమైన అన్ని భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేస్తూనే, భక్తుల సాంప్రదాయలు, ఆచారాలకు ఎటువంటి భంగం కలగకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రజల విశ్వాసాలను గౌరవిస్తూ, ప్రతి భక్తుడికి సౌలభ్యం, గౌరవం, ఆత్మగౌరవం కల్పించడం NDA కూటమి ప్రభుత్వ ధ్యేయం అని అన్నారు.

**జీఎస్**

---------------------------

**సురేష్ ధర్మపురి**

ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో అసిస్టెంట్ డైరెక్టర్ గా పనిచేస్తున్న సురేష్ ధర్మపురి ఎల్లుండి పదవీ విరమణ చేయనున్నారు.. 1998 నుంచి కేంద్ర సమాచార, ప్రసార శాఖకు చెందిన పలు విభాగాల్లో వివిధ స్థాయిల్లో ఆయన సేవలందించారు. ఆకాశవాణి హైదరాబాద్ వార్తా విభాగంలో ఎడిటర్ గా, సహాయ సంచాలకులుగా బాధ్యతలను నిర్వర్తించారు. ఈ సందర్భంగా ఆకాశవాణి కేంద్రంలో ఈరోజు నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో క్లస్టర్ హెడ్, డీడీజీ హరిసింగ్, వార్తా విభాగం అధిపతి ఎం.ఎస్ మహేష్ తదితరులు మాట్లాడుతూ.. రెండున్నర దశాబ్దాలకు పైగా వివిధ హోదాల్లో పనిచేసిన సురేష్ ధర్మపురి సేవలను

ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఆకాశవాణి, ఆర్ ఎన్ యూ సిబ్బంది సురేష్ ధర్మపురికి ఘనంగా వీడ్కోలు పలికారు.

**జీఎస్**

---------------------------

**దిట్వా**

దిట్వా తుఫాను గంటకు 7 నుండి 10 కిలో మీటర్ల వేగంతో తమిళనాడు తీరం వైపు కదులుతోంది. వాతావరణ శాఖ తెలిపిన వివరాల ప్రకారం, ఇది కారైకల్‌కు ఆగ్నేయంగా 320 కిలో మీటర్లు, చెన్నైకి దక్షిణంగా 530 కిలో మీటర్ల దూరంలో ఉంది. ఎల్లుండి ఉత్తర తమిళనాడు, దక్షిణ ఆంధ్ర తీరాలకు చేరుకునే అవకాశం ఉంది.

**ఎస్ఎస్డీ**

------------------------

**జ్యోతిబా ఫూలే వర్ధంతి**

ఈరోజు మహాత్మా జ్యోతిబా ఫూలే వర్ధంతి ఈ రోజు 1890, నవంబర్ 28న ఆయన మరణించిన రోజును దేశవ్యాప్తంగా ఈరోజు స్మరించుకుంటున్నారు. మహాత్మా జ్యోతిబా ఫూలే దేశంలో కుల వ్యతిరేక సంఘ సంస్కర్త, విద్యావేత్త, మహిళల హక్కులు, అణగారిన వర్గాల విద్య కోసం ఆయన చేసిన కృషిని గుర్తు చేసుకుంటున్నారు. సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా పూలే పోరాడారు, అలాగే, విద్యను సార్వత్రికం చేయడంలో ఆయన ముఖ్య పాత్ర పోషించారు. అణగారిన వర్గాల హక్కుల కోసం 1873లో మహాత్మా పూలే సత్యశోధక్ సమాజ్‌ను స్థాపించారు. రాష్ట్రవ్యాప్తంగా జ్యోతిబాపూలే వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వరంగల్, ఆసిఫాబాద్, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో జరిగిన కార్యక్రమాల్లో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

జీఎస్/పిటిసి, ఆసిఫాబాద్, వరంగల్

-----------------------------

**పూలే**

తెలంగాణ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో హైదరాబాదులోని బిజెపి కార్యాలయంలో మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు.  ఈ సందర్భంగా ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బిజెపి అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని లక్ష్మణ్ అన్నారు. కేవలం ఓటు బ్యాంకింగ్ కోసమే అమలు కాని హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేశారని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు.

**బైట్ - లక్ష్మణ్**

**పీటీసీ - హైదరాబాద్**

---------------------------

**శిలాజాలు**

మంచిర్యాల జిల్లా అడవుల్లో 230 మిలియన్ సంవత్సరాలకు చెందిన శిలాజాలను హైదరాబాద్ కు చెందిన చరిత్ర పరిశోధన బృందం సేకరించింది. సింగరేణి కాలనీ సిబ్బందితో కలిసి మంచిర్యాల జిల్లా బొప్పారం ఫారెస్ట్ డివిజన్ లో వృక్ష, జంతు సంబంధిత శిలాజాలను సేకరించారు.

**పీటీసీ - మంచిర్యాల**

------------------------------